

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
జయశంకర్
భూపాలపల్లి
శనివారం 14 జూన్ 2025

సినుకమ్మా.. వానసినుకమ్మా నేల సిన్నబోయె చూడు.. అనే పాట రైతుల ఆవేదనను గుర్తు చేస్తూ ఓ కవి రాశారు. ఆ పాటకు తగ్గట్టుగానే తొలకరికి ఎన్నో ఆశలతో ఆశల విత్తనాలను రైతులు నాటారు.. పదిరోజులైనా వర్షం పత్తా లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. మా ఆశలు చిగురించేనా అని ఎదురు చూస్తున్నారు.. చినుకు రాలకపాయె.. విత్తు మొలవకపాయె అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వివరాలు 7లో

మొలకెత్తని ఆశలు

- వర్షం కోసం అన్నదాత ఎదురుచూపు
- రుతుపవనాలు తాకినా కనిపించని చినుకులు





సదస్సులతో సాధ్యమేనా..!



- 'భూ భారతి'కి పోటెత్తుతున్న దరఖాస్తులు
- అధికారుల చెంతకు బారులు తీరుతున్న ప్రజలు
- జిల్లాలో ఇప్పటికే 20వేలకు పైగా అర్జీలు
- ఈ నెల 20 వరకు జరుగనున్న రెవెన్యూ సదస్సులు

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు భూ భారతి పోర్టల్‌తో ఉపశమనం కలిగిస్తుందా.. లేక తలనొప్పిగా మారుతుందా అనే సందేహం పలువురిలో వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు భూ భారతి రెవెన్యూ సదస్సుల పేరిట గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తోంది. అయితే అధికారుల లెక్కలకు మించి ఈ కార్యక్రమాలకు ప్రజలు పోటెత్తుతుండడం గమనార్హం. ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ఇప్పటివరకు జిల్లాలో 20వేలకు పైగా అర్జీలు ప్రజల నుంచి అందాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సైతం సదస్సుల పేరిట హడావిడి చేసి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకొని పక్కన పెట్టిన అధికారులు ఈ దఫాలోనైనా సమస్యలు పరిష్కరిస్తారో లేక గతంలో మాదిరిగా వ్యవహరిస్తారో నని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

పోటెత్తుతున్నారు..

భూ సమస్యలను తెలుసుకునేందుకు అధికారులు నేరుగా తమ వద్దకే వస్తుండడంతో ప్రజలు అర్జీలు పెట్టుకునేందుకు బారులు తీరుతున్నారు. జిల్లాలోని భూపాలపల్లి, కాటారం డివిజన్ల పరిధిలోని భూపాలపల్లి, గణపురం, చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల, కాటారం, మహాముత్తారం, మహదేవ్‌పూర్, మల్హార్‌రావు, పలిమెల మండలాల్లో రెవెన్యూ సదస్సుల పేరిట ఇప్పటివరకు 20వేలకు పైగా అర్జీలు అధికారులకు అందాయి. పైలెట్ మండ లం కింద మే నెలలో రేగొండ మండలంలో దరఖాస్తులు స్వీకరించారు.


టేకుమట్ల : మండలంలోని పంగిడిపల్లిలో మాట్లాడుతున్న ఆర్డీవో రవి

అవే అర్జీలు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఎటువంటి దరఖాస్తులు వచ్చాయో.. మళ్లీ అవే సమస్యలు భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో దర్శనమిస్తున్నాయి. ఏన్నో ఏండ్లుగా దున్నుకుంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హక్కుదారులుగా ఉన్న అసైన్డ్ భూములకు గత ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడంతో కొన్ని వేల మంది ప్రజలు పట్టాల కోసం కార్యాలయాల చుట్టూ నేటికి తిరుగుతున్నారు. రెవెన్యూ సదస్సుల్లో అసైన్డ్ భూములకు పట్టాలపైనే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. డిజిటల్‌సైన్డ్ పెండింగ్, మిస్సింగ్ సర్వే నంబర్ వంటి సమస్యలను పరిష్కరించే అవకాశం ఉన్న రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు పరిష్కరించకపోవడంతో సమస్యల పరిష్కరం కోసం వాటి సంబంధిత బాధితులు కుడా అర్జీలు పెడుతున్నారు. భూ హక్కు కలిగిన యాజమాని చనిపోతే హక్కుదారులైన(వీరసత్) భార్య, పిల్లలకు ఆ భూమిపై హక్కుదారుగా అధికారం కట్టబెట్టాల్సిన అధికారులు ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా

» మిగతా 8వ పేజీలో...

దేశ భవిష్యత్ తరగతి గదిలోనే : డీఈవో


అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో

భూపాలపల్లిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ అన్నారు. భూపాలపల్లి మండలంలోని కాశీంపల్లి, గంగ్రపల్లి, ఫుల్లూరిరామయ్యపల్లి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థుల చే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భం గా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని అన్నారు. ఈ క్రమంలోనే నిధులు విడుదల చేసి మౌళిక సౌకర్యాల కోసం పనులు చేపించిందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో దేవానాయక్, సీఎంవో సామల రమేష్, ఏఎంవో కాగితపు లక్ష్మణ్, కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీప్రసన్న, పీఎస్‌హెచ్ఎం సమ్మయ్య, ఏపీఏసీ చైర్‌పర్సన్ పుష్పలత, ఉపాధ్యాయులు శైలజ, సూర్యకళ, శిరీష, హసీనాబేగం, స్వాతి, అరుణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్


ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సీఈ చైతన్యకుమార్

మహదేవపూర్ రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కుమార్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ గ్రామమైన ఎల్కేశ్వరంలో శుక్రవారం పర్యటించారు. గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆయన లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల జాబితాతో పాటు ఇప్పటి వరకు ప్రారంభించిన, బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న ఇండ్ల నిర్మాణాలపై ఆరాతీశారు. ఈ ప్రాంతమంతా ఇసుక నేలలు అయినందున బేస్‌మెంట్‌లెవల్ వరకు తప్పనిసరిగా పిల్లర్ల నిర్మాణం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400చదరపు ఫీట్ల నుంచి 600 చదరపు ఫీట్లలోపే ప్లింత్ ఏరియా ఉండాలని తెలిపారు. ఒక లెవల్ పూర్తయిన వెంటనే క్యాష్‌రింగే చేస్తే నిధులు విడుదలవుతాయన్నారు. మేస్త్రీలకు ప్రభుత్వం నిర్ణీత రేట్లు నిర్ణయించిందని. అంతకు మించి వసూలు చేస్తే చట్టరీత్యా చర్యలుంటాయన్నారు. ఆయన వెంట భూపాలపల్లి హౌజింగ్ పీడీ లోకిలాల్, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, స్థానిక డీఈఈ, ఏఈఈలు ఉన్నారు.

16,17 తేదీల్లో ధర్నాను జయప్రదం చేయాలి


మహాసభలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి

గోవిందరావుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16,17తేదీల్లో అన్ని మండలకేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం రెండోరోజు జిల్లా మహాసభ జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతుసంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ముత్యాలు, వడకాపురం సారయ్య, సహాయ కార్యదర్శిగా రూప్‌సింగ్, సభ్యులుగా తీగల ఆదిరెడ్డి, చిట్టెం ఆదినారాయణ, కొండల్‌రావు, గుండు రామస్వామి తదితరులు ఎన్నికయ్యారు.

బాత్‌రూంలో జారిపడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

- పేరూరు ఆశ్రమ పాఠశాలలో విషాదం


రాజేంద్రప్రసాద్ (ఫైల్)

వాజేడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పేరూరు ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో విషాదం చోటు చేసుకుంది. బాత్‌రూంలో జారిపడి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నల్లగొండ రాజేంద్రప్రసాద్(55) శుక్రవారం తన నివాసం ఉండే క్వార్టర్స్‌లో బాత్‌రూంలో జారిప డ్డాడు. రాజేంద్రప్రసాద్‌కు భోజనం పెట్టిన ప్లేట్ అక్కడే ఉండడంతో అనుమానం వచ్చిన ఆశ్రమ పాఠశాల సిబ్బంది బాత్‌రూంలో ఉన్నట్లు గుర్తించారు. ఆయనను ఆశ్రమ పాఠశాల పక్కనే ఉన్న పేరూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో ఏటూరునాగారానికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరిం చారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో ఆయన గురువారం పాఠశాలకు వచ్చి విధులు నిర్వహిస్తు న్నారు. 2022 నుంచి ఆయన పేరూరు ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తుండగా ఇటివలే అనారోగ్య సమస్యలతో వాలంటరీ రిటైర్మెంట్‌కు సైతం దరఖాస్తు చేసుకున్న ట్లు సమాచారం. రాజేంద్రప్రసాద్ స్వస్థలం ఖమ్మం జిల్లా మద్దులపల్లి.ఆయనకు భార్య ప్రమీల, కుమారుడు, కూతురు ఉన్నారు.

మత్స్యకారులు ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలి

వలలు, తెప్పల పంపిణీలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క


మత్స్యకారులకు వలలు, తెప్పలు అందిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మత్స్యకారులు చేపల ఉత్పత్తిని పెంచుతూ సావజిక ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగులోని గిరిజన భవన్‌లో యూఎస్‌టీ నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో జీవంతరావుపల్లి గ్రామంలోని ముదిరాజ్ కులానికి చెందిన కుటుంబాలకు ఆమె వలలు, తెప్పలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామంలో అధికంగా ఉన్న మత్స్యకారులకు నిర్మాణ్ సంస్థ వలలు, తెప్పలు అందించడం అభినందనీయమని అన్నారు. గ్రామాన్ని మోడల్ గ్రామంగా నిర్మించుకుని అందరూ ఉపాధి అవకాశాలు వినియోగిం చుకోవాలని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ప్రతి ఇంటికి సూక్ష్మజీవుల కాలుష్యం లేకుండా నీటిని అందించే ందుకు నీటి శుద్ధీకరణయంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ యంత్రా న్ని(ఆటోమేటిక్ క్లోరినేషన్ డౌసింగ్ సిస్టం) ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, మున్సిపల్ కమిషనర్ సంపత్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇళ్లను మంజూరు చేయాలి

వాజేడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగాల జీపీలో అంగన్‌వాడీ టీచర్‌లకు మంజూరైన ఇళ్లను ఎంపీడీవో రద్దు చేయడంపై అంగన్‌వాడీ టీచర్‌లు శుక్రవారం భద్రాచలంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కలిసి తమగోడును మొరపెట్టుకున్నారు. గత నెలలో మంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందుకున్నామని, ఇళ్లు కట్టుకునేందుకు ఉన్న ఇంటిని తొలగించుకొని ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం పనులు ప్రారంభించే సమయంలో ఎంపీడీవో వచ్చి అంగన్‌వాడీలకు ఇళ్లు కేటాయించలేదని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్‌లు కవిత, శారత, విజయ, లక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు తల్లడి పుష్పలత, విక్రాంత్ వర్మ తదితరులు ఉన్నారు.


భద్రాచలంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

యోగాతో మెరుగైన ఆరోగ్యం

- ములుగు కలెక్టర్ దివాకర


అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ఉదయం యోగాసనాలు చేయడం వల్ల మెరుగైన సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని గిరిజన భవన్‌లో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా నిర్వహిస్తున్న దశాబ్దపు ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్ దివాకర, జిల్లాలోని వివిధశాఖల అధికారులు, కలెక్టరేట్, ఇతర కార్యాలయాల సిబ్బందికి జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షకులచే శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అధికారులు, సిబ్బందితో కలిసి యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని, ఆరోగ్యానికి సంబంధించిన మెళకువలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ లీచంద్ర, డాక్టర్ సంధ్య, యోగా ఇన్‌స్ట్రక్టర్ గురు శివకృష్ణ, హరిత, మానస, లయ, ప్రియాంక, గిరివర్ధన్, జిల్లాస్థాయి అధికారులు, మండలస్థాయి అధికారులు, ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

పూర్తి స్థాయి అధికారి ఎక్కడ..?

- గిరిజన సహకార సంస్థలో అస్తవ్యస్తం
- గ్యాస్ సిలిండర్ సరఫరాలో అధికంగా వసూళ్లు


గిరిజన సహకార సంస్థ కార్యాలయం

మహదేవపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సహకార సంస్థ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా మారింది. సంబంధితశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్యంతో మహదేవపూర్ ఇష్టారా జ్యంగా పాలన సాగుతోంది. జీసీసీకి పూర్తి స్థాయి అధికారి లేకపోవడంతో సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ప్రజలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తుననట్లు ఇబ్బందికరంగా, దురుసుగా ప్రవరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మహదేవపూర్, కాటారం, పలిమెల, మహాముత్తారం, మల్హర్ మండలాలకు మహదేవపూర్ గిరిజన సహకార సంస్థ ద్వారానే గ్యాస్ సరఫరా అవుతుంది. దీంతో గ్యాస్ సరఫరాలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన సమయానికి గ్యాస్ అందక నానా తంటాలు పడుతు న్నారు. బుక్ చేసిన కొన్ని రోజుల తర్వాత వారికి ఇష్టం వచ్చిన ఋసనంయలో గ్యాస్ అందిస్తూ ప్రజలను నానా ఇబ్బంది పెడతున్నారని ప్రజలు తెలుపుతున్నారు. దీంతో పాటు ప్రజల నుంచి గ్యాస్ ధర కంటే అత్యధికంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పల్లె ప్రజల్లో సరైన అవగాహ లేక అవసరాలను ఆసరాగా చేసుకుని అందినంత దోచుకుంటున్నారు. గ్యాస్ డెలివరీ బాయ్ డెలివరీ చార్జీల పేరిట అధికంగా వసూలు చేస్త పదే ప్రజలపై ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్నారు. ఒకవేళ అధిక డబ్బులు ఇవ్వకపోతే గ్యాస్ ని ఇవ్వక చేతులెత్తేస్తున్నారు. ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అవసరం మేరకు డబ్బులు చెల్లించి గ్యాస్‌ను తీసుకుంటున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లినా కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్యాస్ సరఫరాలో సక్రమంగా జరిగేలా అధిక డబ్బులు వసూలు నియంత్రించేలా గిరిజన సహకార సంస్థను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఐదు మండలాల ప్రజలు కోరుతున్నారు.

మంత్రాల అనుమానం.. ఆపై బోరు వివాదం

- అన్న కుటుంబంపై కత్తులతో దాడి
- ముగ్గురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- జనగామ జిల్లా కొన్నె గ్రామంలో ఘటన



తీవ్రంగా గాయపడిన భాస్కర్, గాయపడిన కిష్టయ్య

బచ్చన్నపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలు చేస్తున్నాడనే అనుమానం.. వ్యవసాయ బావి వద్ద బోరు విషయంలో గొడవ ఇద్దరు అన్నదమ్ముల కుటుంబాల మధ్య చిచ్చురేపింది. తమ్ముడి కుటుంబ సభ్యులు.. అన్న కుటుంబంపై కత్తులతో దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ ఎస్కే హమీద్ కథనం ప్రకారం... జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన కురాం కిష్టయ్య, కురాం నర్సింహులు అన్నదమ్ములు. వీరికి వ్యవసాయ బావి వద్ద గల బోరు విషయంలో గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి.

కిష్టయ్య కుటుంబం తమపై మంత్రాలు చేస్తున్నారనే కక్ష పెంచుకున్నారు. గురువారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద బోరు విషయంలో మరోసారి గొడవపడ్డారు. ఇంటికి వచ్చాక రాత్రి 11గంటల సమయంలో నర్సింహులు, అతని భార్య అంజమ్మ, కుమారుడు గణేష్‌లు కిష్టయ్య ఇంటికి వెళ్లి కత్తులతో దాడి చేయగా, కిష్టయ్యతోపాటు అతని కుమారుడు భాస్కర్ తీవ్రంగా గాయపడగా, భార్య యాదమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ దాడిలో భాస్కర్, కిష్టయ్యలకు తీవ్ర రక్తస్రావం కావడంతో బచ్చన్నపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. భాస్కర్ భార్య సుజాత శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



డిప్యూటీ సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న 327 నాయకులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఈఈయూ వినతి

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ అయిన టీఎస్ ఈఈయూ-327 అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ శ్రీధర్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్ చేంజ్ ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపచేయడం, 1999 నుంచి 2004 వరకు ఉద్యోగంలో చేరిన విద్యుత్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా పెన్షన్ కల్పించడం, విద్యుత్ సంస్థలో మిగిలి ఉన్న 6,500మంది అన్‌మ్యాన్, కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని, విద్యుత్‌సంస్థలో సబ్‌స్టేషన్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, కారుణ్య నియామకాల వయస్సును 46 ఏళ్లకు పెంచాలని ట్రాన్స్‌కో సీటీడీ క్యాంప్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు విద్యార్హతలతో పనిలేకుండా గ్రేడ్-1 జీతం ఇవ్వాలని, విద్యుత్ సంస్థలో కోర్టు కేసు ద్వారా నిలిచిన ప్రమోషన్స్‌లో వెంటనే కేసు వేకెట్ చేయించి ప్రమోషన్స్ ఇప్పించాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కోరారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి ట్రాన్స్‌కో సీఎండీతో త్వరలోనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని 327 నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరి ఆడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఒడిశా రోడ్డు ప్రమాదంలో ఇల్లంద యువకుడి మృతి



అనిల్ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన యువకుడు బొంతల అనిల్ (34) ఒడిశా రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాలోని భువనేశ్వర్‌కు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న కలహండి జిల్లా రాంపూర్ మండలంలోని కదెల్ గ్రామంలో మైనింగ్ విభాగంలో అనిల్ పని చేస్తున్నాడు. పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఒడిశాకు బయలుదేరి వెళ్లారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించగా రాత్రి వరకు చేరుకుంటుందని స్థానికులు తెలిపారు. అనిల్ మృతితో ఇల్లందలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు చెల్లెళ్ల వివాహం పూర్తికాగా, ఈ ఏడాది తాను కూడా వివాహం చేసుకునే సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం అందరిని కలిచివేసింది.



బాల్‌బ్యాడ్మింటన్ విజేతగా నిలిచిన వరంగల్ జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అశోక్‌కుమార్



కబడ్డీలో విజేతగా నిలిచిన నల్లగొండ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అశోక్‌కుమార్

విద్యుత్ శాఖ ఉద్యోగుల బాల్‌బ్యాడ్మింటన్ విజేత వరంగల్

కబడ్డీలో నల్లగొండ జిల్లా జట్టు విజయకేతనం

ముగిసిన ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌ల ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌ల ఇంటర్ సర్కిల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు మహబూబ్‌నగర్ జిల్లా జట్టుపై విజయకేతనం ఎగరవేయగా, కబడ్డీలో నల్లగొండ జట్టు విజయం సాధించింది. స్పోర్ట్స్ కౌన్సిల్ వరంగల్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌ల విద్యుత్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. రెండురోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు మధ్య హోరాహోరీగా జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, మహబూబ్‌నగర్ ద్వితీయ స్థానం, నల్లగొండ తృతీయ స్థానాల్లో విజయం సాధించాయి. అదే విధంగా కబడ్డీలో నల్లగొండ ప్రథమ స్థానం, వరంగల్ ద్వితీయ స్థానం, నిజామాబాద్ జిల్లా జట్టు తృతీయ స్థానాల్లో విజేయకేతనం ఎగర వేశాయి.

కాగా, జేఎన్ఎస్‌లోని కబడ్డీ కోర్టులో ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ ఉద్యోగుల క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని హితవు పలికారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి చేరుకోవాలని అశోక్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఇంటర్ సర్కిల్ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు సెప్టెంబరు 1నుంచి 3వరకు యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఆల్ ఇండియా విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో పాల్గొంటారని అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ మధుసూదన్, విద్యుత్ అధికారులు విజయేందర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, ఎన్.జగన్నాథన్, సాంబరెడ్డి, మల్లికార్జున్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంటీపీ సందర్శించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ

గీసుగొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గీసుగొండ, సంగెం మండలాల పరిధిలో శాయంపేట హవేలి శివారులో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గణేష్ ఎకోటెక్ కంపెనీ, దక్షిణకొరియా యంగ్వాన్ కంపెనీలను ఆయన పరిశీలించారు. పార్కులో ముంపునకు గురైన నదీనాల ప్రాంతాన్ని, వరద ముంపును నివారించేందుకు పార్కు మధ్యలో 100మీటర్‌ల వెడల్పుతో నిర్మించే నదీనాలా వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వరద నీటితో పరివాహ ప్రాంతంలో రిటైనింగ్ వాల్‌ను ఏ మేరకు నిర్మించాలో ప్రతిపాదనాలు పంపించాలని ఆయన సూచించారు. కైటెక్స్ కంపెనీలోని ట్రయల్ రన్‌ను ఆయన నిశితంగా పరిశీలించారు. టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన 863 మంది భూ నిర్వాసితులకు ప్లాట్‌లు చేసిన రాజీవ్ మెగా లే అవుట్‌లో కనీస వసతుల ఏర్పాటును అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ సిస్టం, మంచినీటి, విద్యుత్ సరాఫరా వంటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. లే అవుట్ ప్లాట్‌లను భూ నిర్వాసితులకు వెంటనే రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చీఫ్ ఇంజనీర్ రవి, జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, గీసుగొంగ, సంగెం తహసీల్దార్‌లు రియాజుద్దిన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



గణేష్ కంపెనీ వద్ద ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్

సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హంటర్‌రోడ్‌లోని సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. 2025లో ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బీఎస్సీ ఎంపీసీఎస్, ఎంసీఏఎస్, బీఎస్సీ బీజడ్‌సీ, ఎంజడ్‌సీ, బీకాం జనరల్, కంప్యూటర్స్‌తో పాటు బీఏ హెచ్ఈపీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. అర్హత, కలిగిన విద్యార్థినులు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని పూర్తి వివరాలకు 7995010676/9177261514 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వరంగల్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు

గిర్మాజీపేట,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా జూలై 2 నుంచి 31 వరకు వరంగల్ మీదుగా తిరుపతికి ప్రతీ బుధవారం ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది. ప్రతీ బుధవారం ప్రత్యేక రైలు (07251) చర్లపల్లి నుంచి బయలుదేరి వరంగల్ మీదుగా తిరుపతికి వెళ్తుంది. అదేవిధంగా ప్రతీ గురువారం ప్రత్యేక రైలు (07252) తిరుపతి నుంచి బయలుదేరి వరంగల్ మీదుగా చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్‌లో ఆగుతుంది. ఇందులో ఏసీ కోచ్‌లు, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. ప్రయాణీకులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి శ్రీధర్ కోరారు.

నేటి నుంచి డీసెట్ వెబ్ ఆప్షన్లు ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డీసెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమై సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తైన నేపథ్యంలో శనివారం నుంచి వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుందని, 20న సీట్ల అలాట్‌మెంట్ అవుతాయని తెలిపారు. 25 లోపు కాలేజ్‌లో రిపోర్టు చేయాలని, జూలై 1 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని ఆయన పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జనగామ ఏసీపీ చేతన్

ఏటీఎం కార్డులు మార్చి.. డబ్బులు స్వాహా చేస్తూ..

నిందితుడి అరెస్టు.. కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

జనగామ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంకు వచ్చేవారి దృష్టి మరల్చి ఏటీఎం కార్డులు మార్చి డబ్బులో చోరీ చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జనగామ ఏసీపీ పండరి చేతన్ నితిన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీలోని పల్నాడు జిల్లా ఈపూర్ మండలం ఇనుమెల్లకి చెందిన ముల్లమూడి వెంకట కోటేశ్వర్‌రావు ఇంటర్ చదువుతున్న సమయంలో ఇంట్లో నుంచి డబ్బులు తీసుకెళ్లి బెట్టింగ్ ఆడి డబ్బులు పోగొట్టుకుని ఇంట్లో నుంచి పారిపోయాడన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలు మొదలుపెట్టినట్టు వెల్లడించారు. ఏటీఎంలలో డబ్బులు తీయరాని ఖాతాదారుల దృష్టి మరల్చి వారి ఏటీఎం కార్డును తాను తీసుకొని తన కార్డు వారికి ఇచ్చి వారి ఖాతాలోని డబ్బును దొంగిలించేవాడని పేర్కొన్నారు.

పలు కేసులలో జైలుకు కూడా వెళ్లాడని, ఈ మధ్యకాలంలో జైలు నుంచి విడుదలై తిరిగి దొంగతనాలు మొదలుపెట్టాడన్నారు. కరీంనగర్, సిద్దిపేట, జనగామలోని ఏటీఎంలలో తన దైన శైలిలో దొంగతనాలకు పాల్పడి రూ.3,76,800 ప్రజలను మోసం చేసి దొంగిలించినట్లు గుర్తించామన్నారు. జనగామ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఎస్ఐ భరత్ గాలింపు చేపట్టగా, శుక్రవారం ఉదయం జనగామలోని ఏటీఎంల వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బస్టాండు ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని అరెస్టు చేసినట్టు తెలిపారు. విచారించగా పై మోసాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడన్నారు.

నిందితుడి నుంచి రూ.10 వేల నగదు, తొమ్మిది ఎస్‌బీఐ ఏటీఎం కార్డులు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరిచినట్టు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్ఐ భరత్, కానిస్టేబుల్లు బీకరుణాకర్, ఎన్.సాగర్, జె.మహేందర్, సాల్మన్‌ను వరంగల్ సీపీ అభినందించారు.

భూగర్భ మురుగునీటి వ్యవస్థతోనే సురక్షితమైన జీవనం

● ఆచార్య గడ్డం భాస్కర్ ● అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక సమావేశం

హనుమకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థను పటిష్టంగా అమలు చేసినప్పుడే ఆరోగ్యవంతమైన, సురక్షితమైన ప్రజాజీవనం కొనసాగుతుందని ఆచార్య గడ్డం భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని మాస్టర్‌జీ కళాశాలలో క్రియేట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరంగల్ అభివృద్ధి విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాముఖ్యతపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య భాస్కర్ మాట్లాడుతూ.. సమగ్రమైన భూగర్భ మురుగునీటి వ్యవస్థ, ప్రాముఖ్యత, అమలులో ఎదురయ్యే ఆటంకాలు, తాత్కాలిక ప్రజల ఇబ్బందులు, దీర్ఘకాలిక ప్రయోజనాలు, సాంకేతిక సమస్యలు, పరిపాలనాసౌలభ్యం, సాంకేతిక నిపుణుల సూచనలు, సలహాలు, ఇతరత్రా సంబంధిత అంశాలను ప్రజలకు తెలియచేయాలన్న ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న నిపుణులు, పాల్గొన్న మేధావులు

సాంకేతిక నిపుణుడు, రిటైర్డ్ ఎస్ఈ ఎం.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటుకు 1979లోనే సర్వే చేశామని గుర్తు చేశారు. అప్పుడు వరంగల్ పరిధి, జనాభా తక్కువగా ఉండేదని, కానీ ఇప్పుడు పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు అమలుకు గత సంవత్సరం నవంబర్ 17న సూత్రప్రాయంగా రూ.417కోట్లకు ఆమోదం ఇచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టును పటిష్టంగా అమలు చేయడానికి ప్రత్యేకంగా ప్రజారోగ్యశాఖ ఎస్ఈ ఆధ్వర్యంలో సాంకేతిక నిపుణుల కమిటీని నియమించాలని, డిజిటల్ సాంకేతికత, గూగుల్ మ్యాపింగ్ కంటే క్షేత్రస్థాయిలో సర్వే జరపాలని అభిప్రాయపడ్డారు. నిపుణుల కమిటీ పర్యవేక్షణలో ప్రాజెక్టును అమలు చేసినప్పుడే గరిష్టంగా ప్రయోజనాలు పొందగలమన్నారు. సరైన పరిశోధన, పర్యవేక్షణ, ప్రణాళికాబద్ధమైన ఆచరణ ద్వారా మాత్రమే సమగ్ర భూగర్భ మురుగునీటి వ్యవస్థ అమలు సాధ్యమవుతుందన్నారు. కేయూ ఈసీ మెంబర్ పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణంలో అనేక సాంకేతికపరమైన అంశాలు ఉన్నందువల్ల మురుగునీటి కాలువల నిర్మాణం మధ్యలో తెగిపోకుండా ఎస్టీపీ వరకు కొనసాగడం అత్యంత ఆవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌చాన్సలర్ ఆచార్య మహ్మద్ ఇక్బాల్ అలీ, ఆచార్య కె.విజయ్‌బాబు, మాస్టర్ జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూలా రామ్, వైద్యం రాజగోపాల్, రాజేందర్ కుమార్, బండా వివేకానందం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ విద్యార్థులకు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రామ్ జాబ్ మేళాను శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఐసీఎస్ఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ డీఐఈవో జి.శ్రీధర్‌సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025లో ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులు ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

కస్టడీ నుంచి తప్పించుకున్న నిందితుడి అరెస్టు

కాజీపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎస్కార్ట్ నుంచి తప్పించుకున్న నిందితుడిని శుక్రవారం కాజీపేట పోలీసులు అరెస్టు చేశారు. కాజీపేట సీఐ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడిపికొండకు చెందిన కట్కూరి సాయికుమార్ ఇటీవల కాజీపేటలో ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడు. పోలీసులు ఇటీవల ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి బుధవారం వైద్యచికిత్సలకై ఎంజీఎం తరలించే క్రమంలో నిందుతుడి పారిపోయాడు. నిందితుడిని శుక్రవారం కడిపికొండలోని తన ఇంట్లో అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి




మరణించిన వి. శ్రవణ్ కుమార్

కాజీపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన సామంతపూడి శ్రవణ్ కుమార్ (36) వ్యక్తిగత పనిపై విజయవాడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నష్కల్ రైల్వేస్టేషన్ సమీపంలోని వంగాలపల్లి రైల్వే గేట్ వద్ద రైలు నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో శ్రవణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని చెప్పారు. మృతుడు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

నిషేధిత గడ్డిమందు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

మహాముత్తారం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం, కాటారం మండలాల్లో అక్రమంగా నిషేదిత గడ్డి మందు, నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మహాముత్తారం ఏవో అనుషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు వివిధ ప్రాంతాల్లో ఉన్న నిందితులను అరెస్టు చేశారు. కాటారం సీఐ నాగార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం కొంత మంది వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలు, నిషేదిత గడ్డి మందు గుట్టుగా రెండు మండలాల్లో అమ్ముతున్నరనే సమాచారంతో మహాముత్తారం ఎస్సై మహేంద్రకుమార్‌యాదవ్, వ్యవసాయాధికారులతో ఒక టీంగా ఏర్పడ్డారు. రెండు మండలాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడులలో రూ: 5,06,250ల విలుగల 202.50 కేజీల నకిలీ పత్తి విత్తనాలు, రూ: 1,20 లక్షల విలువ చేసే 300ల లీటర్ల నిషేదిత గడ్డి మందును స్వాధీనం చేసుకొన్నామని తెలిపారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అచ్చ హన్మంతరావు, కాటారం మండలానికి చెందిన బొమ్మ సమ్మిరెడ్డి, మల్హర్ మండలం రుద్రారం గ్రామానికి చెం దిన జాడి సమ్మయ్య, మహాముత్తారం మండలం మీనాజీపేటకు చెందిన చీర్ల సతీష్ రెడ్డి, కాటారం గ్రామానికి చెందిన బొమ్మన వెంకటస్వామి, కాటారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కందుల కోటేశ్వర్‌రావులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఏఈవో శివకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.



అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చూపిస్తున్న పోలీసులు.

ఘన చరిత్రకు సాక్ష్యం కలెక్టర్ బంగ్లా

ఒకప్పుడు సుబేదార్ నివాసం.. నిన్నటి వరకు కలెక్టర్ ఆవాసం

- 139 ఏళ్ల కిందట నిర్మాణం
- హెరిటేజ్ మాన్యుమెంట్‌గా గుర్తింపు
- త్వరలో ప్రజల సందర్శనకు అవకాశం
- రూ.2కోట్లతో బంగ్లాకు మరమ్మతులు
- అదే ఆవరణలో కొత్త భవనంలోకి కలెక్టర్ నివాసం



ముస్తాబైన కలెక్టర్ బంగ్లా ముఖ ద్వారం

హనుమకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వరంగల్‌లో ఎన్నో ప్రత్యేక భవంతులు ఉన్నప్పటికీ హనుమకొండ సుబేదారిలో కొలువుదీరిన కలెక్టర్ బంగ్లా హంగూ ఆర్భాటాలు ప్రత్యేకమని చెప్పవచ్చు. గత వైభవానికి సాక్ష్యంగా నిలిచి ఉన్న ఈ బంగ్లాకు ఈ 139 ఏళ్ల చరిత్ర ఉంది. 1886 ఆగస్టు 10న బ్రిటీష్ అధికారి జార్జ్ బాల్మార్ భార్య ఈ బంగ్లా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్వాతంత్ర్యం రాక ముందు సుబేదార్ నివాసంగా ఉండిన ఈ భవనాన్ని స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జిల్లా కలెక్టర్ నివాసంగా ఉపయోగిస్తూ వచ్చారు.

గత వైభవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ బంగ్లాకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) రూ.2కోట్ల వ్యయంతో మరమ్మతులు చేసింది. భవనం స్వరూప స్వభావం ఏ మాత్రం చెదరకుండా, ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా యథాతథంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ బంగ్లాను పునరుద్ధరించింది. వరంగల్ జిల్లా చరిత్రకు సాక్షీభూతంగా నిలిచిన కలెక్టర్ బంగ్లాను వారసత్వ సంపదగా ప్రభుత్వం గుర్తించింది. ఈ భవనం నిర్మాణం గొప్పతనాన్ని, భవనంలోని ప్రత్యేకతలను ప్రపంచానికి తెలియచేసేందుకు త్వరలోనే ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంచబోతున్నారు. ఇదే ప్రాంగణంలో వెనుక భాగాన కొత్తగా నిర్మించిన భవనంలోకి కలెక్టర్ నివాసాన్ని మార్చారు.



మరమ్మతులతో కొత్త అందాలను సంతరించుకున్న కలెక్టర్ బంగ్లా

డంగు సున్నంతో..

కలెక్టర్ బంగ్లాను ఆ కాలంలో పూర్తిగా డంగు సున్నంతో కట్టారు. ఎక్కడా సిమెంట్, కాంక్రీట్ వాడలేదు. పైఅంతస్థు నిర్మాణంలో, అలాగే టెర్రస్‌లో నాణ్యమైన టేకు కర్రలను ఉపయోగించారు. బంగ్లాకు మరమ్మతులు చేసేప్పుడు ఏ మాత్రం సిమెంట్ వాడలేదు. బంగ్లా బాగా పాతపడిపోవడంతో లోపలిగోడలు, స్తంభాలు, పైకప్పు పెచ్చులూడిపోయాయి. దీంతో గోడలన్నిటినీ పూర్తిగా చెక్కి, మళ్లీ డంగు సున్నంతోనే ప్లాస్టరింగ్ చేసింది. డంగు సున్నాన్ని హైదరాబాద్ నుంచి తెప్పించారు. కొంత స్థానికంగా తయారు చేశారు. మరో వందేళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా మరమ్మతులు చేశారు. బంగ్లాలో దెబ్బతిన్న కిటికీలు, పైకప్పు దూలాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని అమర్చారు, పై అంతస్థుకు వెళ్లడానికి ఉన్న చెక్కమెట్లను అలాగే ఉంచి దెబ్బతిన్న చోట మరమ్మతులు చేశారు. బ్రిటీష్ కాలంలో కరెంట్ ఉండేది కాదు. వెలుతురు కోసం పొగరాని కొవ్వొత్తులను ఉపయోగించేవారు. ఈ కొవ్వొత్తులను అమర్చడానికి ఆ నాడు ఉపయోగించిన అందమైన షాండ్లియర్స్ ఇప్పటికీ అలాగే చెక్కు చెదర కుండా ఉన్నాయి. వాటిని ఏ మాత్రం మార్చకుండా అవసరమైన చోట మరమ్మతులు చేశారు. బంగ్లా ప్రవేశ ద్వారంపైన ఒక పెద్ద గడియారం ఉన్నది. జర్మనీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేసిన ఈ గడియారం పాతబడి పని చేయడం లేదు. దీనిని కూడా తిరిగి పని చేసేలా రూ.5లక్షల వ్యయంతో మరమ్మతులు చేశారు. బంగ్లా ఆవరణలో ఉన్న పురాతనమైన ఫౌంటేన్‌కు కూడా మరమ్మతులు చేశారు. గార్డెన్‌ను అభివృద్ధి చేశారు. గ్రీనరీని పెంచారు. బంగ్లా అంతా సున్నం వేసి అందంగా తీర్చిదిద్దారు. దర్వాజలు, కిటికీలు, పైకప్పు దూలాలకు ఆ కాలం నాటి రంగులనే వాడారు. పైకప్పు కారకుండా పూర్తిగా వాటర్ ప్రూఫ్ చేశారు. కొత్తగా కరెంట్ వైరింగ్‌ను అప్పటి పద్ధతిలోనే చేశారు. ఈ బంగ్లాలో మొత్తం 18 గదులు, ఒక విశాలమైన పోర్టికో, పైఅంతస్తుకు వెళ్లడానికి మెట్లు ఉన్నాయి. వాటన్నిటికీ కొత్త రూపును ఇచ్చారు. కలెక్టర్ బంగ్లాలో నిజాం కాలంలో తవ్విన రెండు పురాతన బావులు కూడా ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. బంగ్లాలో నివసించేవారికి అసవరమైన నీటిని ఈ బావుల నుంచే వాడుకునేవారు. వీటిని కూడా మరమ్మతులు చేశారు.

ప్రజల సందర్శనార్థం

ఇటీవలి వరకు కలెక్టర్లకు నివాసంగా ఉన్న ఈ పురాతన భవనం ఇక నుంచి ఒక వారసత్వ కట్టడంగా ఉండబోతోంది. కలెక్టర్ నివాసం కోసం ఈ బంగ్లా ఆవరణలోనే కొత్తగా మరో భవనం నిర్మించారు. ప్రజల సందర్శనకు త్వరలోనే పాత కలెక్టర్ బంగ్లా గేట్లు తెరవబోతున్నారు. ఒక హెరిటేజ్ మాన్యుమెంట్‌గా సంరక్షించనున్న ఈ భవనంలో వరంగల్ జిల్లా చారిత్రక, సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించే ప్రదర్శనశాలను, శతాబ్దకాలంలో చోటు చేస్తున్న చారిత్రక ఘట్టాలను ప్రతిబింబించే ఛాయాచిత్రాలు, గ్రంథాలు, పురాతన వస్తువులతో కూడిన ఆర్కీవ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న చారిత్రక ఆనంద్ భవన్ తరహాలో దీనిని తీర్చిదిద్దుతారు.



కలెక్టర్ బంగ్లా ఆవరణలో అభివృద్ధి చేసిన గ్రీనరీ

ప్రత్యేకతల సమాహారం

50 మంది కలెక్టర్లు నివాసమున్న ఈ బంగ్లా నిజాం పాలనలో జరిగిన అతి పెద్ద కట్టడాల్లో ఒకటి. ఇందులోకి అడుగుపెడితే చిత్రవిచిత్రాలనెన్నో కనిపిస్తాయి. భవన నిర్మాణంలో తీసుకున్న శ్రద్ధ అనువణువునా కనిపిస్తుంది. భవనం బయటికి ఎంత అందంగా ఉంటుందో లోపల కూడా అంతే రాజసంగా కనిపిస్తుంది. అడుగడుగునా ఆనాటి భవన నిర్మాణ కార్మికుల నేర్పరితనం గోచరిస్తుంది. కలెక్టర్ బంగ్లాను సుబేదార్ బంగ్లా అని కూడా పిలుస్తారు. నిజాం రాజు పరిపాలనా సౌలభ్యం కోసం తన రాజ్యాన్ని ఆరు సుభాలుగా విభజించాడు. ఇందులో వరంగల్ సుభా ఒకటి. ఈ సుభా కింద 61 పరగణాలు ఉండేవి. ఆ కాలంలో సుబేదారిని లష్కర్ అని కూడా పిలిచేవారు. సుభాను పర్యవేక్షించడానికి అప్పట్లో సుబేదార్ ఉండేవాడు. ఆయన నివాసం కోసం ఆ నాడు కట్టిందే ఈ ఈ బంగ్లా. రాజం ఉట్టిపడేలా, ఒక కోటను తలదన్నే రీతిలో బంగ్లా నిర్మాణం జరిగింది. దాదాపు 13 ఎకరాల విస్తీర్ణంలో రెండు ఎకరాల స్థలంలో నిర్మించారు. రాచరిక తీవికి నిదర్శనంగా ఈ భవనం నిలుస్తుంది.

ఆకట్టుకునే నిర్మాణ శైలి

బంగ్లాలోపలికి వెళ్లే ముందు పెద్ద కమాను కనిపిస్తుంది. ఈ కమానుపైన అతి పెద్ద గడియారాన్ని ఏర్పాటు చేశారు. లోపల ఉన్న విశాల ప్రాంగణంలో పచ్చిక బయళ్లు, నీటి కొలను, అందులో అతిపెద్ద ఫౌంటేన్ కనిపిస్తాయి. అతిథులతో కూర్చొని మాట్లాడటానికి వీలుగా విశాలమైన హాలును నిర్మించారు. ఈ భవనంలోపలికి వెళ్లడానికి ఒక వైపు మాత్రమే మార్గం ఉంది. పైఅంతస్తులో ఒక విశాలమైన టెర్రస్ వంటి నిర్మాణం ఉంటుంది. భవన నిర్మాణం అద్భుతంగా ఉంటుంది. ప్రతీ అంతస్తులో చెక్కమెట్లు ఉన్నాయి. అవి ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ధారాళంగా గాలి, వెలుతురు రావడానికి వీలుగా తలుపులు, కిటికీలను వరుసగా అమర్చారు. వాటికి దగ్గట్టుగా గదుల నిర్మాణం చేశారు.

భవనాలకు మరమ్మతులు

భవిష్యత్తు తరాలకు ఈ భవన నిర్మాణ కౌశలాన్ని తెలియచేసేందుకు ఇది ఒక నిదర్శనంగా మిగులుతుంది. ఈ బంగ్లా వరంగల్‌కు ఒక ఐకాన్. ఎన్నో ఉపద్రవాలను ఎదుర్కొని సజీవసాక్ష్యంగా నిలిచింది. వరంగల్‌కు ఎన్నిసార్లు వరదలు వచ్చినా ఇంచు మందం కూడా చెక్కుచెదరని చారిత్రక సంపద ఈ నిర్మాణం. ఈ బంగ్లాను పరిరక్షించాల్సిన అవసరం ఉందని, లేదంటే కాలగతిలో కలిసిపోయే ప్రమాదం ఉందని గుర్తించిన కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ దీని సంరక్షణ బాధ్యతను తీసుకున్నది. ఇందులో భాగంగానే భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి త్వరలో ప్రజల సందర్శనార్థం ఉంచబోతోంది. వీటితో పాటు వంద సంవత్సరాలు దాటిన మరికొన్ని పురాతన కట్టడాలకు మరమ్మతు చేసి వాటిని కూడా హెరిటేజ్ మాన్యుమెంట్లుగా పరిరక్షించే బాధ్యతను కూడా చేపట్టబోతోంది. నిజాం కాలం నాటి భవనాల్లో ప్రస్తుతం వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఉన్న ఒకప్పటికీ నీటిపారుదల శాఖ కార్యాలయ భవనం, నక్కలగుట్టలోని నీటిపారుదలశాఖ ఈఈ కార్యాలయం భవనం, సుబేదారిలోని డీఐజీ బంగ్లా, ఆర్‌టీసీ ఓల్డ్‌బస్ డిపోకు ఎదురుగా గల ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, హనుమకొండ విజయటాకీస్ రోడ్డులోని రాజరాజనరేంద్ర భాషానిలయం మొదలైనవి వీటిలో ఉన్నాయి. వీటిని కూడా వరంగల్ వారసత్వ సంపదగా పరిరక్షించాలని నిర్ణయించింది.



కలెక్టర్ బంగ్లా మరమ్మతు పనుల్లో కూలీలు

అమూల్యమైనది రక్తదానం

- బ్లడ్ డొనేషన్‌పై పెరుగుతున్న స్పృహ
- అత్యవసరంలో ముందుకొస్తున్న రక్తదాతలు
- ప్రత్యేక వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు
- అవసరమైన చోటుకు వెళ్లి రక్తదానం
- మానవత్వం చాటుతున్న యువత
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



ఏప్రిల్ 14న 94వ సారి రక్తదానం చేస్తున్న మల్లిగారి రాజు

జనగామ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సకాలంలో అవసరమైన రక్తం అందక ఎన్నో ప్రాణాలు అంతవాయువుల్లో కలుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రూ.లక్షలు వెచ్చించినా కావాల్సిన గ్రూపు రక్తం దొరకడం కష్టం. ఈ క్రమంలో ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తి ప్రాణాలు నిలపడం కష్టమే. కానీ రక్తదాతలు ముందుకొచ్చి రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు నిలుపుతున్నారు. గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత సమాజంలో రక్తదానంపై యువత, నడివయస్సు వారిలో స్పృహ, అవగాహన భారీగా పెరగడం హర్షించదగ్గ విషయం. ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులు, బాధితుల పరిస్థితులను చూసి చలించి ఎంతో మంది యువత ముందుకు వచ్చి రక్తదాతలుగా మారుతున్నారు. అవసరమైతే సొంత ఖర్చులు భరించే దూర ప్రాంతాలకు వెళ్లి మరీ రక్తదానం చేసి వస్తున్నారు. కళ్లెదుట చావులను చూసి కొందరైతే, ప్రాణం విలువ తెలిసి కొందరు రక్తదాతలుగా మారుతున్నారు. పదుల సంఖ్యలో రక్తదానాలు చేస్తూ పలువురి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు

రక్తదానంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి రక్తం అందించేందుకు కొంతమంది యువత వాట్సాప్‌ను వేదికగా చేసుకున్నారు. రక్తదానం పేరుతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఆసక్తి ఉన్న రక్తదాతలను, ప్రముఖులను అందులో చేర్చుతున్నారు. రక్తం అవసరమైతే రక్తదాత వాట్సాప్ గ్రూపులతోపాటు ఇతర ఇతర గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు. స్పందించిన యువకులను తీసుకెళ్లి రక్తదానం చేయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో రక్తదాన గ్రూపులను యువత ఏర్పాటు చేసుకొని ఆదర్శంగా నిలుస్తున్నారు.

రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం చేస్తే ఒకరికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రాణదానం చేసినట్లే. రక్తదానాన్ని ప్రోత్సహించేందుకు జూన్ 14న ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రతీ రోజూ పెద్ద సంఖ్యలో రక్తం అవసరమవుతూ ఉంటుంది. ప్రతీ ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంకులు సైతం డిమాండ్ తగ్గట్టుగా రక్తాన్ని అందించలేకపోతున్నాయి. చాలా అరుదైన గ్రూపులైన ఏబీ నెగిటివ్, బీ నెగిటివ్ రక్తం దొరకడం చాలా కష్టమవుతోంది. దేశ జనాభాలో ఏబీ నెగిటివ్ గ్రూపు రక్తం 0.6శాతం, బీ నెగిటివ్1.5శాతం మందికి మాత్రమే ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా ప్రతీ నెలా ఒక కోటి 46లక్షల యూనిట్ల రక్తం అవసరమ వుతుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇందుకు ప్రతీ 1000 మందికి 36.3మంది చొప్పున రక్తదానం చేయాల్సి ఉంటుందని అంచనా.

ఇప్పటికి 94 సార్లు రక్తదానం



రక్తం అందకపోవడంతో మా మేనమామ చనిపోవడం నన్ను రక్తదాతను చేసింది. 1997లో రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొంది. సకాలంలో రక్తం అందకపోవడంతో చనిపోయారు. అలాంటి దుస్థితి ఎవరికీ రావద్దొన్న నిర్ణయానికి అప్పుడే వచ్చాను. నా 19 ఏళ్ల వయస్సులో రక్తదానం చేయడం ప్రారంభించాను. ఈ 28 ఏళ్లలో 94 సార్లు రక్తదానం చేశాను. ప్రతీ మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా, మధ్యలో మహనీయుల జయంతి సందర్భంగా రక్తదానం చేస్తుంటాను. రక్తం అవసరముందని తెలిస్తే చాలా సొంత ఖర్చులతో హైదరాబాద్‌కు వెళ్లి కూడా ఇచ్చి వచ్చాను.

-మల్లిగారి రాజు, జనగామ

'అమ్మ బ్లడ్ డోనర్' గ్రూపు ద్వారా..



ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పించడంతోపాటు అత్యవసర సమయాల్లో రక్తదానం చేసేలా ప్రోత్సహించేందుకు 'అమ్మ బ్లడ్ డోనర్' అనే వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశాం. 2019 డిసెంబరులో ఏర్పాటు చేసిన గ్రూపు ద్వారా చాలా మంది రక్తదానం చేశాం. అవసరమున్న వారి వివరాలను ఆ గ్రూపుతో పాటు ఇతర వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ పెడతాం. ఆసక్తి ఉన్న వారిని తీసుకెళ్లి వారితో రక్తదానం చేయిస్తాం. ఎవరిదైనా బర్త్‌డేలు అయిన సందర్భంలోనూ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లి రక్తదానం చేయిస్తాం. అప్పట్లో పెద్దగా పట్టించుకోపోగా ప్రస్తుతం యువతలో రక్తదానంపై అవగాహన, ఆసక్తి ఏర్పడింది.

-మంతెన మణి, అమ్మ పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జనగామ

మీ శాఖల నుంచి ఉద్యోగులను పంపండి..

- ఇతర శాఖలకు లేఖ రాసిన దేవాదాయ శాఖ
- ఈవోలు, ఏసీలు, డీసీలుగా పని చేసేందుకు ఆహ్వానం
- దేవాదాయశాఖ ఉద్యోగుల్లో కలకలం

హనుమకొండ కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇతర ప్రభుత్వ శాఖల నుంచి అధికారులను, ఉద్యోగులను డిప్యూటేషన్‌పై తీసుకోవాలని దేవాదాయశాఖ తీసుకున్న నిర్ణయంపట్ల ఈశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.దేవాదాయశాఖలోనే బోలెడంత మంది అనుభవం కలిగిన ఉద్యోగులు ఉండగా.. ఇతర శాఖల నుంచి తీసుకోవడం ఎందుకు అని వారు ప్రశ్నిస్తున్నారు. దేవాదాయ శాఖలో రెగ్యులర్ ఉద్యోగుల నియామకం జరిగే వరకు కార్యనిర్వహణ అధికారులుగా, అసిస్టెంట్ కమిషనర్లుగా, డిప్యూటీ కమిషనర్లుగా డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు అర్హులైన ఉద్యోగులను తమ శాఖల నుంచి డిప్యూట్ చేయాలని కోరుతూ కమిషనర్ పురపాలన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధితోపాటు మరో అయిదు శాఖలకు దేవాదాయ శాఖ కమిషనర్ ఇటీవల లేఖ రాయడం కలకలం రేపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖలో 250 మంది ఎగ్జిగ్యూటివ్ ఆఫీసర్లు, అనేక మంది క్లరికల్ సిబ్బంది పని చేస్తున్నారు. ఆలయాల నిర్వహణలో వీరికి అపారమైన అనుభవం ఉంది. డిపార్ట్‌మెంటల్ టెస్టులూ వారు ఉత్తీర్ణులై ఉన్నారు. అనేక మంది తగిన విద్యార్హతలతో దీర్ఘకాలంగా పని చేస్తున్నారు. దేవాదాయ శాఖలో వివిధ కేడర్లలో చాలా అనేక ఖాళీలు ఉన్నప్పటికీ వారికి ఇప్పటివరకు పదోన్నతులు లేకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. సర్వీస్‌పరంగా నష్టపోతున్నారు. ఈ వేలుగా పదోన్నతులు పొందకుండానే చాలా మంది రిటైర్ అవుతున్నారు. ఫలితంగా న్యాయంగా పొందాల్సిన ప్రయోజనాలు వారికి దక్కడం లేదు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ నిర్వహణలో పెద్దఎత్తున ఆదాయం, ఆస్తులు కలిగిన దేవాలయాలు 646 వరకు ఉన్నాయి. అయినప్పటికీ ఒక డిప్యూటీ కమిషనర్ పోస్టు, ఆరు అసిస్టెంట్‌కమిషనర్ పోస్టులు, మరో ఆరు ఎగ్జిక్యూటివ్ గ్రేడ్-1 పోస్టులు, 61 వరకు ఎగ్జిగ్యూటివ్ గ్రేడ్-3 పోస్టులు సుదీర్ఘంగా భర్తీ కాక ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు ఎగ్జిక్యూటివ్ గ్రేడ్ 1,2,3 పోస్టులు, ముఫిసిల్ స్టాఫ్ పోస్టుల్లో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాల్సిందిగా ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు గతంలో అనేక సార్లు విజ్ఞప్తి చేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడేమో ఈవోలు, ఏసీలు, డీసీలుగా డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు ఉద్యోగులను పంపాలని పరాయి శాఖలను కోరడం విడ్డూరంగా ఉందని ఉద్యోగులు అంటున్నారు. దేవాదాయ శాఖలో అనేక మంది చాలా ఏళ్లగా ఔట్‌సోర్సింగ్, కన్సాలిడేటెడ్ పద్ధతిపై పని చేస్తున్నారు. కనీసం వీరినైనా రెగ్యులరైజ్ చేసి అవసరాన్ని బట్టి ఆయా పోస్టుల్లో వారి సేవలను వాడుకోవచ్చుకదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.క్రిష్ణమాచారి, ప్రధాన కార్యదర్శి టి.రత్నాకర్ దేవాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. అలాగే దేవాదాయ శాఖ మంత్రి సురేఖను కలిశారు. ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై ఉద్యోగులను తీసుకునే ఆలోచనను మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖలోని అర్హులైన ఉద్యోగులతోనే ఎగ్జిగ్యూటివ్ ఆఫీసర్స్, ఇతర ఉద్యోగ ఖాళీలను భర్తీచేయాలని అభ్యర్థించారు. దేవాదాయ శాఖలోని ఉద్యోగులకు అన్యాయం చేయవద్దని కోరారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తా..

- జీడబ్ల్యూఎంసీ నూతన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ




అధికారులతో తొలి సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి చాలా పెద్దదని, ఇక్కడి ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని నూతన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి రాజేశ్వర్ నుంచి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మీడియాతో మాట్లాడారు. తనకు కరీంనగర్ నగర పాలక సంస్థలో పనిచేసిన అనుభవం ఉందని, మునిసిపాలిటీలో అన్ని వింగ్‌లను ప్రక్షాళన చేస్తానని అన్నారు. వరంగల్ ప్రజలు చాలా చైతన్యవంతులని, కరీంనగర్‌కంటే వరంగల్ నగరంలో ఇంకా ఎక్కువగా పని చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది కలిసి పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చహత్ బాజ్‌పాయ్ తన కార్యాలయంలో బల్దియా వింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారులను పరిచయం చేసుకున్న తర్వాత ఒక్కొక్క విభాగం పని తీరు, సిబ్బంది వివరాలు, అందుబాటులో ఉన్న వాహనాల సంఖ్య, డీజిల్, పెట్రోల్ వినియోగం, పని చేస్తున్న సిబ్బంది, తప్పించుకుని తిరిగే సిబ్బంది వివరాలు ఒక్కో విభాగం అధికారిని అడిగి ప్రశ్నల వర్షం కురిపించారు. పని విధానంలో ఎక్కువ మిస్ యూజ్ జరుగుతోంది? అకౌంట్స్ విభాగం నుంచి డీజిల్, పెట్రోల్‌కు నెలకు ఎంత ఖర్చు చేస్తున్నారు? అభివృద్ధి పనులకు ఏ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు? బిల్లులు ఏ విధంగా చెల్లిస్తున్నారు? అని శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. బల్దియా వాహనాలకు జీపీఆర్ఎస్ సిస్టం అమర్చారా?, అది ఐటీ విభాగానికి అనుసంధానం చేసి ఉందా అని అడిగారు. శానిటేషన్ విభాగంలో ఎంత మంది పని చేస్తున్నారు? ఎక్కడెక్కడ పని చేస్తున్నారు? అని తెలుసుకున్నారు. బల్దియాకు కీలక విభాగం అయిన టౌన్‌ప్లానింగ్‌లో ప్రధాన అధికారిని ఇప్పటి వరకు ఎందుకు నియమించలేదని అక్కడి అధికారులను ప్రశ్నించారు. తాను ప్రజల కోసం పని చేయడానికి వచ్చానని, అధికారులు, సిబ్బంది సహకరిస్తే సక్సెస్‌ఫుల్‌గా సేవలందించవచ్చని అన్నారు. మునిసిపాలిటీలో అన్ని విభాగాలు తనకు తెలుసునని, ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదని అధికారులను హెచ్చరించినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అడ్మిన్ రాజేశ్వర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఇన్‌చార్జిసీపీ రవీంద్రరాడేకర్,పీఆర్‌వో అయూబ్ అలీఖాన్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ మహేందర్, డీఎఫ్‌వో శంకర్‌లింగంలు పాల్గొన్నారు.

మొలకెత్తని ఆశలు

- వర్షం కోసం అన్నదాత ఎదురుచూపు
- రుతుపవనాలు తాకినా కనిపించని చినుకులు
- సూక్ష్మ సేద్యంతో రైతుల తిప్పలు



స్ప్రింక్లరల ద్వారా పత్తి చేనును తడుపుతున్న రైతు

చిట్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అడపాదడపా కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతులు వాటిని బతికించుకునేందుకు అరిగోస పడుతున్నారు. స్ప్రింకర్లతో నీటినిపడుతూ ఇబ్బందులు పడుతున్నారు.ఆశలతో పంటలు సాగుచేస్తున్న రైతులకు జూన్ నెలలో సాధారణం కంటే తక్కువ వర్షాపాతం నమోదవుతుండడంతో ఆశలు కోల్పోతున్నారు. కొంతమంది రైతులు బావుల కింద ఉన్న మోటార్లతో పైపుల ద్వారా కాలువలు తీసి నీటిని అందిస్తుండగా కొంత మంది రైతు లు స్ప్రింక్లర్ల ద్వారా మొలకెత్తిన గింజలను కాపాడుకునేందుకు నానా యాతన పడుతున్నారు. చిట్యాల మండలంలోని చల్లగరిగె, నైన్‌పాక, వెలిశాల, టేకుమట్ల మండలం, రేగొండ మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో సుమారు 2.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ముందస్తుగా పత్తి విత్తనాలు విత్తడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

వాజేడు ఎస్సైగా సతీష్

వాజేడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాజేడు పోలీస్‌స్టేషన్ ఎస్సైగా జక్కుల సతీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సై రాజ్‌కుమార్ ఏటూరునాగారానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో వెంకటాపూర్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సతీష్‌ను వాజేడుకు బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

వెంకటాపూర్ ఎస్సైగా చల్ల రాజు

వెంకటాపూర్ : వెంకటాపూర్ నూతన ఎస్సైగా చల్ల రాజు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై జక్కుల సతీష్ వాజేడు ఎస్సైగా బదిలీ కాగా ఆయన స్థానంలో చల్ల రాజు బదిలీ అయి విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఎస్సై రాజుకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఏటూరునాగారం ఎస్సైగా రాజ్‌కుమార్

ఏటూరునాగారం : ఏటూరునాగారం నూతన సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై)గా నరిగే రాజ్‌కుమార్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై ఎస్.కె తాజుద్దీన్‌ను భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వాజేడు ఎస్సైగా పనిచేస్తున్న నరిగే రాజ్‌కుమార్‌ను ఏటూరునాగారానికి బదిలీ చేయగా, ఆయన బాధ్యతలు చేపట్టారు.

పశువైద్యం అందని ద్రాక్షేనా !

● శిథిలావస్థలో ఆస్పత్రి భవనం ● వేధిస్తున్న సిబ్బంది కొరత ● పట్టించుకోని అధికారులు, పాలకులు

కన్నాయిగూడెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న పశువుల ఆస్పత్రి అక్కరకు రాకుండా పోతోంది. పశు పోషకులకు, రైతులకు ఏ మాత్రం ఉపయోగపడడం లేదు. ఉన్న భవనం కాస్త శిథిలావస్థకు చేరింది. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. వర్షాకాలం వస్తే పనిచేసే సిబ్బంది వణుకుతూ పనిచేయాల్సిందే. కన్నాయిగూడెం మండలంలో మొత్తం 11 గ్రామ పంచాయతీలు , 21 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో పశువులకు ఏదైనా వ్యాధులు వస్తే ఈ ఆస్పత్రికే తీసుకు రావాల్సి ఉంది. తొలకరికి పశువులు, గొర్రెలు అనారోగ్యాన బారిన పడే అవకాశముంటుంది. ఈ తరుణంలో ఆస్పత్రికి వస్తే పశువులను చూసే సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఇంతకు ముందు ఉన్న ఉద్యోగులు బదిలీపై వెళ్లడంతో రొయ్యూరు పశు వైద్యాధికారికి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియదు. కేవలం ఒక అటెండర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. సదరు అటెండరే ఆస్పత్రి తీయాలి.. ఆమెకు తెలిసిన వైద్యమే అందించాల్సిన పరిస్థితి ఉంది. చేసేది లేక చాలామంది రైతులు, పశు పెంపకం దారులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. ప్రైవేటు వైద్యులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని



కన్నాయిగూడెంలో ఉన్న పశువైద్యశాల

అందిన కాడికి దోచుకోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి పశు వైద్య ఆస్పత్రి భవనానికి మరమ్మతులు చేయించి , రెగ్యులర్ అధికారి, సిబ్బంది ఉండేలా చూడాలని పలువురు రైతులు, ప శు పెంపకందారులు కోరుతున్నారు.

పూర్తి స్థాయి ఎస్‌టీవోను నియమించాలి

మహదేవపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో పూర్తి స్థాయి ఎస్‌టీవోను నియమించాలని డీటీఎఫ్ మండల నాయకులు కోరారు. ఈ మేరకు మహదేవపూర్ మండల కేంద్రంలో శుక్రవారం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడక మధు, కొత్తపల్లి సారంగపాణి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయంలో ఉపాధ్యాయుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వెంటనే పూర్తి స్థాయి ఎస్‌టీవోను నియమించాలని డిమాండ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

తాడ్వాయి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ముగ్గురికి రూ.4వేల జరిమానాతో పాటుగా రెండు రోజుల జైలు శిక్షను శుక్రవారం ములుగు కోర్టు విధించింది. అంతేకాకుండా మరో 19మందికి 18వేల రూపాయల జరిమానా విధించిందని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. పలుమారు రోడ్డు భద్రతపై అవగాహన చేస్తున్న కొందరు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మండలంలో మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని చట్టనికి అందరూ సమనులే అని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోనే కార్యకర్తలకు గుర్తింపు

కాటారం జూన్ 13(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నేత పుట్ట మధు కాంగ్రెస్ పార్టీ నాయకులపై చేసిన వాఖ్యలు మతి భ్రమించి మాట్లాడినట్లు ఉన్నయని టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు అంగోతు సుగుణ, మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్, మాజీ ఎంపీపీ సమ్మయ్యలు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విలేకర్లతో మాటాల్డఆరు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జాడి మహేశ్వరి, దేవేందర్, శ్రీహరి, అశోక్, తిరుపతిరెడ్డి, మధుకర్, కుమార్, రాజు పాల్గొన్నారు.

● మహదేవపూర్, కాంగ్రెస్‌లోనే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోట రాజబాబు అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు వ్యాఖ్యలు సరికావన్నారు. కాంగ్రెస్‌లో నాయకులకు అన్యాయం జరుగుతుందని మాట్లాడడం సరికాదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న దుద్దిళ్ల శ్రీనుబాబుపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే కార్యకర్తలకు సముచిత న్యాయం ఉంటుందన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

తాడ్వాయి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత తరగతులు 8,9,10వ తరగతులు చదువుకుంటున్న విద్యార్థులకు ఆర్టీసీ బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని శ్రీ రామ్ యువజన సంఘం డిమాండ్ చేశారు. శుక్రవారం నార్లాపూర్ పాఠశాలను పరిశీలించిన యువజన సంఘం అధ్యక్షుడు రాధారపు కిరణ్ విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యువకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మహదేవపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారు ఫోరం మహదేవపూర్ మండల అధ్యక్షులు సట్ల సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి అయూబొద్దిన్ తెలిపారు. ఈ మేరకు మహదేవపూర్ మండల కేంద్రంలో సర్వ మత ప్రార్థన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించాలని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ వేడుకలను జయప్రదం చేయాలి

తాడ్వాయి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవాల వేడుకలను జులై 7న గ్రామ గ్రామాన జరుపుకోవాలని ఎంఎస్‌పి ములుగు జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు కరుణాకర్, గజ్జల ప్రశాంత్, దుర్గయ్య పాల్గొన్నారు.

యోగా ప్రతీ మనిషికి అవసరం

మంగపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) ప్రతీ మానవుడు నిత్యం యోగాసనాలు చేస్తే మంచిదని యోగి వేమన కేంద్రం గురువు యర్రంకాని రాంబాబు అన్నారు. మంగపేట ప్రభుత్వ పీహెచ్‌సీలో అంతర్జాతీయ యోగా దశాబ్ది మానోత్సవాలలో భాగంగా శనివారం యోగా గురూజీ రాంబాబు ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆయూష్‌శాఖ ఆదేశాలను సారంగా వైద్యులు వైద్య సిబ్బందితో యోగ ధ్యానం ప్రాణాయామం చేశారు. మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

మహాముత్తారం, జూన్13(ఆంధ్రజ్యోతి): మహాముత్తారం మండలం ములుగుపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా నారయణరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహాముత్తారం, కాటారం మండల పార్టీ అధ్యక్షులు మేడిపల్లి పూర్ణచందర్, పాగే రంజీత్, ములుగుపల్లి అధ్యక్షుడు అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పంపిణీపై ఆరోపణలు తగవు

తాడ్వాయి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్యపు ఆరోపణలు సరైనవి కావని ఇండ్ల ఎంపిక కమిటీ సభ్యులు, ఇండ్ల లబ్ధిదారులు శుక్రవారం గ్రామంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుబాసి సుధాకర్, నారాయణ, సమ్మయ్య, కార్తిక్, శ్రావణ్, సుగుణ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఆఫీస్‌లో మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మునిసిపల్ కమిషనర్

భూపాలపల్లిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతపై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయంలో మెగా వైద్య శిబిరాన్ని కమిషనర్ బిర్రు శ్రీనివాస్ ర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక మార్పు అభివృద్ధికి మలుపు అని అన్నారు. 100 రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిని ప్రత్యేక ఆహ్వానితులుగా డీఎంహెచ్‌వో మధుసూదన్ హాజరయ్యారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మిన్ట్రేషన్ నుంచి ఎఫ్ఈ అన్నపూర్ణ, రవికుమార్‌లు పర్యవేక్షించగా వైద్యులు సుభాష్, రోహిణి, స్వాతి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఈవో

వెంకటాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపురం పంచాయతీ పరిధిలి కలిపాక గ్రామంలో కాఫెడ్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం, కిచెన్‌గార్డెన్‌పై శుక్రవారం గ్రామస్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఏఈవో శ్రీకన్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసదస్సులో సంస్థ మండల కోఆర్డినేటర్ జి.హనుమంతు, వాజేడు కోఆర్డినేటర్ జి.కామేష్, యానిమేటర్‌లు ప్రశాంత్, నరేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు జరపాలి

మంగపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) మాదిగలు ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవాలను ప్రతివాడల్లో గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని అనుబంధ విభాగాల నిర్మాణాలను దిమ్మలు నిర్మించి నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల సురేష్‌మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తిమ్మంపేటలో నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా గోనె అఖిల్‌మాదిగ, ప్రధానకార్యదర్శులుగా గోనే కృష్ణమాదిగ, పూసా భానుమాదిగ, ఉపాధ్యక్షులుగా గోనే విష్ణుమాదిగ, పూసా వినయ్‌మాదిగ తదితరులను ఎన్నుకున్నారు.

మోదీ పాలనలో దూసుకుపోతున్న భారత్

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మచ్చలేని సుపరిపాలన నరేంద్ర మోదీ ప్రభుత్వానిదని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి అల్లాపూర్ శ్రీనివాసరావు, రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సంకల్పం సహకారం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 11ఏళ్ల మోదీ పాలన సుపరిపాలనకు కేరాఫ్ అడ్రస్ అన్నారు. 2047నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మొదటి స్థానంలో ఉండాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యం అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపన్న, జన్నె మొగిలి, ప్రసాద్‌రావు, బట్టు రవి, దొంగల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

మంగపేట జూన్ 13 (ఆంధ్రజ్యోతి) మంగపేటలోని ఏఎస్ఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మహ్మద్ హుష్మీ ఎంపీసీ సెకెండియర్ ఇంగ్లీష్ మీడియంలో 984/1000 మార్కులు సాధించిన విషం తెలిసిందే. గ్రూఫ్ ఫస్ట్ ఇయర్ చదివిన తాలూక మాధవీలత 460/470, టార్‌గా నిలువడంతో ఇద్దరు విద్యార్థులను, వారి కుటుంబసభ్యులు, గురువులను శ్రీ లక్ష్మీనర్సింహ దత్తసేన సేవా ట్రస్ట్ సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు ట్రస్ట్ నుంచి ఒక్కొక్కరికి రూ, 2,000లు, నగదు ప్రశంసాపత్రాలు సభ్యులు అందజేసి మాట్లాడారు. విద్యాభివృద్ధికి సహకరించి అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యాలయాల్లోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాయిని వీరేందర్ ట్రస్ట్ చైర్మన్ ఈశ్వర్‌చ ంద్‌శర్మలతో పాటు కలశాల అధ్యాపక బృందం బోదనేతర సిబ్బంది ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. విజేతలతో పాటు ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సింహరావు సేవలు మరువలేనివి



నర్సింహరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మంగపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అల్లెం నర్సింహరావు ఆదివాసీ జాతి కోసం చేసిన ఉద్యమ సేవలు మరువలేనివని కాం గ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మంపేట గ్రామపంచాయతీ పరిధి గిరిజ న గూడెమైన అబ్బాయిగూడెంలో నర్సింహరావు సంతాప సభ జరిగింది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి అధ్యక్షతన వహించగా సోమయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు పూజారి సురేందర్‌బాబు అయ్యోరి యానయ్య టి. భగవాన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వ ర్లు, సహకార సంఘం మాజీ డైరెక్టర్ గంగినేని శేషగిరి , కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు చాద మల్లయ్య, బసారికాని హరికృష్ణ బోడ బొర్రయ్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకొన్న ఫోన్లు అందజేత

కాటారం జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన కొంత మంది తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకొన్న వ్యక్తులకు శుక్రవారం ఎస్సై అభినవ్ ఫోన్లను అందజేశారు. గారెపల్లి, కాటారం, పోతులవాయి గ్రామాలకు చెందిన బాలచందర్, ఇందుజా, రవీందర్లకు వివిధ కంపెనీలకు చెందిన ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు పరామర్శ

కాటారం, జూన్13(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం బీఆర్ఎస్ మంథని ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పర్యటించారు. గారెపల్లి, మద్దులపల్లి గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ బంధం రాజమణి, బీఆర్ఎస్ మండల మహిళ అధికారప్రతినిధి రజనీ, గోమాస మౌనికలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండలాధ్యక్షుడు రామిల్ల కిరణ్, మహిళ అధ్యక్షురాలు సౌజన్య, నాయకులు పంతకాని సడువలి, సంతోష్, గాలి సడువలి, శ్రావణ్, రాజేంద్రచారి, రవి, శ్రీలక్ష్మి, నాగమణి, దుర్గరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మోటారు చోరీ

మహాముత్తారం, జూన్13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యామన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో నీటి నిలువ చేసే ట్యాంకులో నూతనంగా ఏర్పాటు చేసిన రూ: 15వేల విలువ చేసే విద్యుత్ మోటారును గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం బడి తెరిచిన అనంతరం విద్యుత్ మోటారు ఆన్ చేసి నీళ్లు పడుదామని చూడగా కనిపించలేదు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయలు గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

మహదేవపూర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీప్పవని మహదేవపూర్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. మహాత్మాగాంధీ ఉపాధి పనుల కింద చేపట్టిన చెల్లింపుల విషయంలో రూ 4.65 కోట్ల వేతన వివరాలు ఆడిట్ బృందానికి అందించడం జరిగిందని తెలిపారు. అడిట్ బృందం మూడు రోజుల పాటు తనిఖీ చేసి ఎక్కడైతే అక్రమాలు జరిగాయో అక్కడి నుంచి నివేదిక తీసుకోనుందని తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు అడిట్ బృందం సేకరించిందని తెలిపారు. తనిఖీ బృందం మూడు రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి కొలతలను పరిశీలించి నివేదిక తయారు చేస్తుందన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

రేగొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుంచి గీత కార్మికుడు కింద పడడంతో మృతి చెందిన సంఘటన మండలంలోని రామన్నగూడెం తండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తాళ్ళపల్లి రాములు(50) శుక్రవారం సాయత్రంం తాటి చెట్టు ఎక్క డానికి వెళ్ళాడు. ఈ క్రమంలో చెట్టు ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

వాహనదారులు రోడ్డు టాక్స్ తప్పక చెల్లించాలి

కృష్ణకాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతీ ఒక్కరు తప్పక రోడ్డు టాక్స్ చెల్లించాలని రవాణాశాఖ జిల్లా అధికారి సమ్మనీ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఎదురుగా ఆకస్మీకంగా వాహనాల తనిఖీ చేపట్టారు. టాక్స్ వివరాలు, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్సులపై ఆరా తీశారు. ఫిట్‌నెస్, రోడ్డు టాక్స్ చెల్లించని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలి

వాజేడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం పట్టా ల్యాండ్‌లో అక్రమ ఇసుక తోలకాలను ఆపాలని వాడబలిజ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇసుక తోలకాలు జరుపుతున్న ప్రదేశాన్ని ఆయన ఆ సంఘ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సదరు కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా గోదావరిలో ఇసుకను తీస్తున్నారని ఆయన ఆరోపించారు. గోదావరి గర్భంలో సుమారు 7 మీటర్ల లోతులో ఇసుకను తీస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేర కాకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపితే వాడబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లిఖార్జునరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గురి రమ ణయ్య, నాయకులు బొల్లె ఆదినారాయణ, సర్వేశ్వరరావు, పానెం సురేష్, అల్లి సూరిబాబు, సూర్యం, శ్రీరాములు, తునూరి రఘుబాబు, తదితరులు ఉన్నారు.

సదస్సులతో సాధ్యమేనా ..!

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోకపోగా కనీసం వారికి అవగాహన కల్పించిన దాఖలలు లేవు. వీరసత్ సమస్యలతో చాలామంది వినతులు సమర్పిస్తున్నారు. దీంతో పాటు నమోదు కావల్సిన భూమిలో కొంత మాత్రమే పట్టాకు నమోదు కావడం, మిగిలిన భూమిని పట్టాలో ఎక్కించేందుకు ఆ సంబంధిత భూ బాధితులు చాలా మంది భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో మొరపెట్టుకుంటున్నారు. సాగుచేసుకుంటున్న భూమి అధికారుల పొరపాటుతో ఇతరులపై నమోదైతే తిరిగిన అసలైన యాజమాని పేరిట భూమి నమోదు కావడం వంటి సమస్యలు కుడా రెవెన్యూ సదస్సుల్లో భారీగా నమోదవుతున్నాయి.

భూసమస్యల పరిష్కారం తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీల అమలు సాధ్యమేనా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కావాల్సిందల్లా సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి మాత్రమే. డిజిటల్‌సైన్, సర్వే నెంబర్ మిస్సింగ్, విరసత్ వంటి సమస్యలతో పాటు మరికొన్నింటికి గతంలో ఉన్న ధరణి పోర్టల్‌లో పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంది. కానీ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు లంచాలకు మరిగి ప్రజలను పీల్చి పిప్పిచేయడంతో లంచాలకు ఇచ్చుకోలేని ప్రజల సమస్యలు అలాగే పెండింగ్‌లోనే ఉండిపోయాయి. ప్రభుత్వం మారింది. వ్యవస్థ మారుతోంది. ధరణి స్థానంలో భూ భారతి వచ్చింది. ప్రజల సమస్యలు మారుతాయో లేదో చూడాలి.

'భూ భారతి'ని వినియోగించుకోవాలి : ఆర్డీవో

టేకుమట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భూ రికార్డులకు సంబంధించిన సమస్యలున్న రైతులు భూ భారతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఆర్డీవో ఎన్.రవి అన్నారు. పంగిడిపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన భూ భారతి సదస్సు కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, రైతుల సమస్యలను అగిడి తెలుసుకున్నారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. భూ భారతి సదస్సులకు సంబంధించిన సమాచారం. ఒక్క రోజు ముందుగానే ఆ గ్రామంలో రైతులకు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి లో వచ్చిన వినతులను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కారిం చాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మీ, ఆర్ఐ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●కృష్ణకాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగేడులో భూభారతిపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. మొత్తంగా 790 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు. ఆర్ఐ రామస్వామి, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.

●మొగుళ్లపల్లి : మండలకేంద్రంలోని రైతువేదికలో భూభారతి చట్టంలో భాగంగా అధికారులు శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ సునీత, ఆర్ఐ శివరామకృష్ణలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

●మంగపేట : రాష్ట్రప్రభుత్వం రైతుల వద్దకు అధికారులను పంపించి భూమాత గ్రామసభలు నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేసిందని అందుకే రైతుల వద్దకే వచ్చి తాము భూముల సమస్యలపై దరఖాస్తులను తీసుకొంటున్నామని స్థానిక తహసీల్దార్ తోట రవీందర్ నయాబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావులు వెల్లడించి మాట్లాడారు. మండలంలోని బోరునర్సాపురం వాడగూడెంలలోని గ్రామపంచాయతి కార్యలయాల వద్ద భూమాత రెవెన్యూ సదస్సులను రెవెన్యూ అధికా రులు నిర్వహించారు. ఆర్ఐలు శ్రీనివాస్ ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం : మండలంలోని అర్హులైన రైతులు రైతు భరోస పథకాకి ధరఖాస్తు చేసుకోవాలని ఏవో ఒక ప్రకటనలో కోరారు. 2025 జూన్ 5 కంటే ముందు పట్టాదారు పాసు బుక్ వచ్చిన వాళ్ల ధరఖాస్తు ఫారంతో పాటుగా పాస్ బుక్ జిరాక్సు, అకౌంటు జిరాక్సు , జతపరిచి జూన్ 20 లోపు ఏఈవోకు అందజేయాలని తెలిపారు

● కాటారం : మండలంలో భూభారతి చట్టం అమలు కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి, శుక్రవారం, కొత్తపల్లి, మల్లారం రెవెన్యూ గ్రామాల పరిధిలో సదస్సులు నిర్వహించారు. భూసమస్యలపై కొత్తపల్లిలో130, మల్లారం230 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సదస్సుల్లో డీటీ రాంమోహన్, ఆర్ఐ వెంకటన్న, భూభారతి కో ఆర్డినేటర్ శ్రీహరిలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అమ్మ మాట - అంగన్‌వాడీ బాట

కాటారం, జూన్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాంపల్లి, రఘుపల్లి, కొత్తపల్లి, గొల్లపల్లి, గుండ్రాత్‌పల్లి, లక్ష్మీపూర్ తదితర గ్రామాల్లో అమ్మమాట- అంగన్‌వాడీబాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీణ, శివరాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, సువర్ణ, రోజా, జయలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్లలోని ఎస్సీకాలనీ, రాంరావుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహి ంచారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం తిరుపతి, ఎల్ఎఫ్‌హెచ్‌ఎమ్ పద్మా, ఎస్సీ కాలనీ హెడ్‌మాస్టర్ అరుణ్‌కుమార్, సీఆర్‌పీ సమత ఉన్నారు.

● వెంకటాపురం: మండలంలోని బెస్తగూడెం పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం పుష్పలత ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉపాధ్యాయులు కృష్ణారావు, కళ్యాణి, ఉషారాణి, రమణ, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

● మహాముత్తారం : మండలంలోని కొర్లకుంట, లంబడిపల్లే, యామన్‌పల్లి, గండికామారం గ్రామాలలో శుక్రవారం అంగన్వాడీల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు జయప్రద, బీమక్క, రమ, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు.

● కన్నాయిగూడెం : మండలంలోని ప్రభుత్వ పాఠశాల ల్లో సామూహిక అక్షరభ్యాసాలు జరిగాయి. మండలంలోని దేవాదుల లో జరిగిన అక్షరభ్యాస కార్యక్రమంలో ఎస్సై ఇనిగాల వెంకటేష్ పాల్గొని చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు.



కాటారంలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్